క్లుప్తంగా...

నేడు ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

సంతోష్‌నగర్: దక్షిణ మండలం పరిధిలో సంతోష్‌నగర్ ఏసీపీ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఉదయం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ ప్రారంభించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి హోంమంత్రితో పాటు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితరులు హాజరవుతారన్నారు.

పల్లె రవికి సన్మానం



జియాగూడ: తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక సహకార సంస్థ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పల్లె రవికుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చార్మినార్: చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని బుధవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ అహీర్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ట్రస్టీ శశికళ ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి. ఉమామహేంద్ర, కె.సురేందర్, రవి మెహ్రా, కునాల్ రావు పాల్గొన్నారు.

పండుగలు సోదర భావాన్ని పెంపొందిస్తాయి

అఫ్జల్‌గంజ్: పండుగలు పరస్పరం సోదర భావాల్ని పెంపొందింపజేస్తాయని టీఎన్జీవో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ అన్నారు. టీఎన్జీవోల సంఘం ఉస్మానియా ఆస్పత్రి శాఖ ఆధ్వర్యంలో బుధవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ... కుల మతాలకు అతీతంగా వైద్య ఉద్యోగులందరూ పరస్పర పండుగలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం టీఎన్జీవో సంఘం గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ, డాక్టర్ నాగేందర్, ఆర్ఎంఓ డాక్టర్లు శేషాద్రి, రఫీ శాలువా, పూల మాలలో ఘనంగా సన్మానించారు.

పురాతన బావిపై సర్కారు దృష్టి

- ఫలక్‌నుమా బస్ డిపోలో స్టెప్ వెల్
- నిజాం తన వ్యక్తిగత ఈతకొలంగా వినియోగించిన మెట్ల బావి పునరుద్ధరణ
- పునరుద్ధరణకు సిద్ధమైన హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ.
- ఆర్టీసీతో ఎంఓయు సంతకాలు చేసిన హెచ్ఎండీఏ






ఫలక్‌నుమా బస్ డిపోలోని పురాతన మెట్ల బావిని పరిశీలిస్తున్న అధికారులు

చార్మినార్: నిజాం తన వ్యక్తిగత ఈత కొలనుగా వినియోగించిన ఫలక్‌నుమా బస్ డిపోలోని స్టెప్ వెల్ (పురాతన మెట్ల బావి)ను పునరుద్ధరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పురాతన బావి పునరుద్ధరణకు హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సిద్ధమైంది. దాదాపు 300 సంవత్సరాల క్రితం నాటి ఫలక్‌నుమా బస్ డిపోలో స్టెప్ వెల్ ఉన్న అంశం హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో గత ఏప్రిల్ 3వ తేదీన స్టెప్ వెల్ పునరుద్ధరణ చర్యల్లో భాగస్వామ్యంగా ఉన్న కల్పనా రమేశ్‌తో కలిసి హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ అధికారులు డిపో లోపల ఉన్న పురాతన బావి (స్టెప్ వెల్)ను సందర్శించారు.

ఫలక్‌నుమా ప్యాలెస్‌కు అతి సమీపంలో...

ఫలక్‌నుమా ప్యాలెస్‌కు అతి సమీపంలో ఉన్న ఈ పురాతన బావిని నిజాం తన వ్యక్తిగత ఈత కొలనుగా వాడేవారని తెలుస్తుంది. ఫలక్‌నుమా బస్ డిపో స్టెప్ వెల్ పునరుద్ధరణ కోసం బుధవారం తెలంగాణ ఆర్టీసీ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, సాహి ఎన్జీవో సంస్థ ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.



కార్యక్రమంలో హెచ్ఎండీఏ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ షేక్ మీరా, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ ఎండివోర్ జాయింట్ సెక్రటరీ కల్పన రమేశ్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం వినయ్ భాను, ఫలక్‌నుమా డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, హెచ్ఎండీఏ డీఏఓలు ఎం.బద్రినాథ్, అరుణ్ జైశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి వినతిపత్రం అందజేత



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ అధ్యక్షతన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఊరేగింపు కమిటీ సభ్యులతో బుధవారం కలిసి ఈ సంవత్సరం నిర్వహించే బోనాల కార్యక్రమాలు, వివరాలు, ప్రభుత్వం తరపున ఏర్పాట్లు కొరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళేశ్వర దేవాలయం అధ్యక్షులు గాజుల అంజయ్య, జగదాంబ దేవాలయం అధ్యక్షులు రాకేశ్ తివారీ, ముత్యాలమ్మ దేవాలయం అధ్యక్షులు పాటిల్ సదానంద్ యాదవ్, ఉప్పుగూడ మహంకాళి దేవాలయం అధ్యక్షులు మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, ఎస్.పి.క్రాంతి కుమార్, భవానీ శంకర్ గౌడ్, శ్రీధర్, ప్యారసాని వెంకటేశ్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

కియార నృత్యానికి ఏడు వరల్డ్ రికార్డ్స్ సొంతం

నాంపల్లి: శ్రీ వెంకటేశ్వర స్వామి 108 నామాలను స్తుతిస్తూ ఏడేళ్ల బాలిక వరల్డ్ రికార్డ్స్ కోసం బుధవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఏడు కలశాలపై వెలిగించిన 77 దీపాలు కలిగిన ఏడు కేజీల బరువును మోస్తూ, సప్త స్వరాలకు అనుగుణంగా నర్తిస్తూ కూచిపూడి నృత్య శైలిలో ప్రదర్శించిన నృత్యం సభికుల నుంచి చప్పట్ల వర్షం కురిపించింది. సందీప్‌రెడ్డి, శిరీష దంపతుల కుమార్తె చుడి కియార రెడ్డి ఏడు నిమిషాల నిడితో చేసిన నృత్యానికి ఏడు వరల్డ్ రికార్డులను సొంతం చేసుకుంది. నికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ చేతుల మీదుగా భారత్ వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్స్ కో ఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు వరల్డ్ రికార్డులను ప్రకటించి చిన్నారి చుడి కియారను సత్కరించారు.

సిటీ కళాశాలకు ప్రత్యేక వసతి గృహం కల్పించాలి

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు వసతి గృహం నిర్మించాలని కోరుతూ ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్, కళాశాల అధ్యక్షులు దిలీప్ ప్రజాపతి వినతిపత్రం అందజేశారు. సిటీ కళాశాలకు 100 సంవత్సరాలు పూర్తయినా... ఇప్పటి వరకు కూడా డిగ్రీ విద్యార్థులకు హస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. మారుమూల గ్రామాల నుండి విద్యనభ్యసించడానికి సిటీ కాలేజీలో సీటు సంపాదించుకుంటే విద్యార్థులకు హస్టల్ వసతి లేక వేల రూపాయలు ఖర్చువుతున్నాయన్నారు. ఎన్నో ఆశలతో ఈ కళాశాలలో సీటు సంపాదించుకుంటే వసతి గృహం లేక విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు జగదీష్, మహేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతాం



రవికిరణ్‌కు మెమోరాండం అందజేస్తున్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వెంటనే చేపడుతామని జీహెచ్ఎంసీ జోనల్‌కమిషనర్ రవికిరణ్‌పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తామన్నారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ రవికిరణ్‌కు మెమోరాండం అందజేశారు. ఫీల్‌ఖానాలో వ్యాపారుల కోసం ఆధునాత మరుగుదొడ్ల నిర్మాణం, చాక్నివాడిలో కూలిన నాలా మరమ్మతులు బేగంబజార్ మార్కెట్‌లో స్టాళ్ల నిర్మాణాల పూర్తి, చంద్రకిరణ్ బస్తీలో వర్షానికి కూలిన గోడల నిర్మాణలతో పాటు పలు బస్తీల సమస్యలు జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు నందకిశోర్‌వ్యాస్ బిలాల్ వివరించారు. బేగంబజార్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్ బిలాల్, బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌రాజ్, కోటి శైలేష్‌కురుమ, పప్పుమాత్రే పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన బధిర విద్యార్థులు

యాకుత్‌పురా: పదో తరగతి వార్షిక పరీక్షల్లో పాతబస్తీ ఆశ్రయ ఆకృతి స్వచ్ఛంద సంస్థకు చెందిన ఐదు మంది బధిర విద్యార్థులు 9.0తో ఉత్తీర్ణత సాధించారు. యాకుత్‌పురా చాంద్రాయణగుట్టలో విద్యాభ్యాసం చేస్తున్న బధిర విద్యార్థులు షర్ఫుద్దీన్ పాషా, అంతుర్ రహీం షాయిస్తా, మహ్మద్ సోహేల్, ఫరీసా ఫాతిమా సలీం, అర్బాజ్ సలీంలు 9.0 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించడం పట్ల సంస్థ డైరెక్టర్ డీపీకె బాబు హర్షం వ్యక్తం చేశారు.

పీవీ రావు సేవలు ఎనలేనివి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మాలలకు ఎక్కడ అన్యాయం జరిగినా మాలల జేఏసీ అండగా ఉంటుందని జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. బుధవారం గన్‌ఫౌండ్రీలోని జేఏసీ కార్యాలయంలో అంబేద్కరిస్ట్ పీవీ రావ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పీవీ రావు అని గుర్తు చేశారు. మాలలకు సామాజిక, ఆర్థిక రాజకీయ రంగాలలో ప్రాధాన్యత దక్కాలన్నారు. జేఏసీ ముఖ్య సలహాదారులు జి.శంకర్, వైస్ చైర్మన్‌లు టి.రవి, మంత్రి నరసింహా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చాంద్రాయణగుట్ట: భారీ వర్షానికి చెట్టు కూలి ఇల్లు ధ్వంసమైన బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు అండగా నిలిచారు. భయ్యాలాల్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని చెట్టు కూలి పక్కనే ఉన్న గీత ఇంటిపై పడడంతో ధ్వంసమయ్యింది. విషయం తెలుసుకున్న జమ్మిచెట్టు రాజు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు చేయించారు. అనంతరం ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదు, ఇటుక, సిమెంట్ కూడా అందజేశారు.

తప్పిపోయిన అమ్మాయిని ప్రభుత్వ శిశు విహార్‌కు తరలింపు



తప్పిపోయిన అమ్మాయి.

దూద్‌బౌలి: హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పిపోయిన అమ్మాయిని గుర్తించి పోలీసులు యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ శిశు విహార్‌కు తరలించినట్లు హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నరేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటల సమయంలో చార్మినార్ సమీపంలోని నిమ్రా హోటల్ వద్ద మూడేళ్ల బాలిక ఏడుస్తూ కనిపించింది. విధుల్లో భాగంగా అక్కడే హుస్సేనీఆలం పోలీసులు అమ్మాయిని గమనించి స్టేషన్‌కు తీసుకొచ్చి ఆమె వివరాలు వాకబు చేయగా అమ్మాయి కోసం ఎవరూ రాకపోగా.. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ శిశు విహార్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ అమ్మాయి ఆచూకీ తెలిసిన వారు హుస్సేనీ ఆలం 040-27854793, 8712660335కు సమాచారం అందించాలన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న కె.లక్ష్మణ్

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడు రోజుల పాటు జరగనున్న ఖేలో భారత్– జీతో భాగ్యనగర్ వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొని క్రీడాకారులతో కరచాలనం చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకొని క్రీడల్లో రాణించాలన్నారు. గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువతి మృతి

సంతోష్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువతీ మృతి చెందిన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుక్కుగూడ మహేశ్వరం ప్రాంతానికి చెందిన ఇస్లావత్ లక్ష్మణ్ కూతురు ఇస్లావత్ మైనా (27) ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఇస్లావత్ మైనా చంపాపేట్‌లోని మంద మల్లమ్మ గార్డెన్ నుంచి తన స్కూటీ ద్విచక్ర వాహనంపై జమా మసీదు చౌరస్తా వైపు వెళుతుండగా... వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో లారీ వెనుక టైరు కింద పడిన మైనా తీవ్ర గాయాలకు గురైంది. దీంతో మైనాను స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. తీవ్రమైన గాయాలు కావడంతో ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో మైనా తండ్రి లక్ష్మణ్ కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ మైనా